
క్లుప్తంగా

త్రైత సిద్ధాంత గ్రంథం ఆవిష్కరణ



మరికల్: మండలంలోని పెద్దచింతకుంట ఆంజనేయస్వామి ఆలయం ఆవరణలో సోమవారం త్రైత సిద్ధాంత ఇందూ ప్రచార గ్రంథాలను ఆవిష్కరించారు. అనంతరం త్రైత సిద్ధాంత గ్రంథాల గూర్చి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇందూ జ్ఞాన వేదిక జిల్లా సభ్యులు నాగ్యానాయక్, రాంరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, కిశోర్, తిరుపతయ్య, శ్రీనివాసులు, వెంకటేష్, రజిత, రాధిక, స్వాతిక, లహరి పాల్గొన్నారు.

సాయి మందిరంలో వానరం



కోస్గి: పట్టణంలోని లక్ష్మీ వెంకటేశ్వర శివసాయి అయ్యప్ప ఆలయాల ప్రాంగణంలోని సాయి మందిరంలో సోమవారం ఓ వానరం సాయి పాదాల చెంత కూర్చొని భక్తులను ఆకట్టుకుంది. మధ్యాహ్న హారతి సమయంలో మందిరంలోకి వచ్చిన వానరం బాబా పాదాల చెంత కొంతసేపు కూర్చుంది. ఈ దృశ్యాన్ని కొందరు భక్తులు తమ ఫోన్‌లలో బంధించారు.

నిలిచిన పనులు.. ఇబ్బందుల్లో ప్రయాణికులు

నర్వ: మండలంలోని మక్తల్, గద్వాల్ ప్రధాన రహదారి పనులు కాంట్రాక్టర్ అర్ధాంతరంగా నిలిపివేశారు. దీంతో రహదారి అడుగడున గోతులు, తేలిన కంకర దర్శనమిస్తోంది. అదేవిధంగా పెద్దకడ్మూర్ నుంచి బెక్కర్‌పల్లి వరకు రహదారి నిర్మాణకోసం రూ. 90 లక్షల నిధులు మంజూరు అయ్యాయి. నిధులు మంజూరై రెండు నెలలు గడుస్తున్నా కాంట్రాక్టర్ పనులను ప్రారంభించడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని రహదారి నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నా కాంట్రాక్టర్‌పై చర్య తీసుకోవాలని ఆయా మండల ప్రజలు కోరుతున్నారు.

నేడు రక్తదాన శిబిరం

నారాయణపేట రూరల్: రెడ్‌క్రాస్ సొసైటీ, ప్రభుత్వ ఆస్పత్రి సౌజన్యంతో మంగళవారం స్థానిక ఆర్టీసీ డిపోలో నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని రెడ్‌క్రాస్‌సొసైటీ కన్వీనర్ సుదర్శన్‌రెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంజిత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు డిపో ఆవరణలో జరిగే శిబిరానికి ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, స్నేహితులు, యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై రక్తదానం చేయాలన్నారు. రక్తదానం చేసిన వారికి ధృవపత్రం అందిస్తామన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

నారాయణపేట రూరల్: పట్టణంలోని 11కేవీ ఫీడర్ మరమ్మతు పనుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ఎండీ రఫీ తెలిపారు. మంగళవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పట్టణంలోని మ్యాదర్‌గేరి, శివాజీనగర్, మహంకాళిస్ట్రీట్, బహార్‌పేట, సరాఫ్‌బజార్‌తో పాటు మండలంలోని జిలాల్‌పూర్, భైరంకొండ, ఎక్లాస్‌పూర్‌లలో కరెంటు సరఫరా నిలిచిపోతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇన్‌స్పైర్ మనక్‌పై ఓరియంటేషన్

నారాయణపేట రూరల్: ఇన్‌స్పైర్ అవార్డులకు సంబంధించి నామినేషన్ ప్రక్రియపై ఎస్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో టీశాట్ చానల్ ద్వారా మంగళవారం మధ్యాహ్నం 2గంటలకు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు డీఈఓ రవీందర్ తెలిపారు. ప్రాజెక్టుల నమోదుపై అవగాహన కల్పిస్తారని, జిల్లాలోని అన్ని పాఠశాలల హెచ్ఎంలు, సంబంధిత టీచర్లు విధిగా వీక్షించాలని సూచించారు.

టీటీడీపీ కొడంగల్ ఇన్‌చార్జ్‌గా వెంకట ప్రసాద్

కోస్గి: టీటీడీపీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా పట్టణానికి చెందిన సామల వెంకట్ ప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ నియామక పత్రం అందజేశారు. వెంకట్ ప్రసాద్ ఎంపిక కోస్గి మండల నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

పార్టీ బలోపేతానికి కృషి

దామరగిద్ద: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా టీడీపీ పార్లమెంటరీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా రాములుయాదవ్‌ను అధిష్టానం నియమించింది. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. తనపై నమ్మకంతో నియోజక వర్గ ఉపాధ్యక్షుడిగా నియమించిన చంద్రబాబునాయుడికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ ప్రమాదాలపై అవగాహన



మాట్లాడుతున్న ట్రాన్స్‌కో ఎస్ఈ ప్రభాకర్

నారాయణపేట రూరల్: విధి నిర్వహణలో విద్యుత్ ఉద్యోగ, కార్మికులు తగిన జాగ్రత్తలు పాటిస్తే చాలా రకాలైన ప్రమాదాలను నివారించొచ్చని ట్రాన్స్‌కో ఎస్ఈ ప్రభాకర్ అన్నారు. విద్యుత్ భద్రతా ఉత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. విద్యుత్ సిబ్బంది పనుల్లోకి వెళ్లే సమయంలో తప్పకుండా నియంత్రణ ఉపకరణలను వెంట తీసుకుని వెళ్లాలని, అవసరం మేరకు వాటిని ఉపయోగించాలన్నారు. లైన్‌పై పనిచేస్తున్న సమయంలో చేతులకు తొడుగులు వాడాలని, స్తంభాలను ఎక్కే సమయంలో హెల్మెట్ ఉపయోగించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పనిచేసే ఆర్టిజన్, జేఎల్ఎం, ఎల్ఎంలు అర్తింగ్‌రాడ్‌తో పోల్‌పై విద్యుత్‌ను డిస్చార్జ్ చేసి పనులు చేయాలన్నారు. మరమ్మతు పనులు చేసే సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడారని, బాధ్యతతో పని చేయాలని కోరారు. ప్రతీ క్షణం తన కుటుంబ సభ్యులను గుర్తుంచుకుని పనిచేస్తే ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉండదన్నారు. డబుల్ ఫీడింగ్ లేకుండా లైన్లు సరిచూసుకోవాలని, ఉప విద్యుత్ కేంద్రాల్లో ఎల్‌సీ విషయంలో ఎంతో జాగ్రత్తగా ఉండాలని ఆదేశించారు. విధి నిర్వహణలో అత్యుత్సాహం పనికిరాదని, వినియోగదారులతో మర్యాదగా వ్యవహరించాలన్నారు. ప్రతి ఒక్కరికి తెలియని విషయాలపై అవగాహన కల్పించాలని, దురుసుగా వ్యవహరించరాదని కోరారు. కార్యక్రమంలో డీఈ సంజీవ్‌రెడ్డి, ఏడీ నందకిశోర్, ఏఈ సాయినాథ్‌రెడ్డి, అనిల్, వినోద్, సిబ్బంది పాల్గొన్నారు.

గొర్రెలకు బదులు నగదు బదిలీ చేయాలి



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు, కాపరులు

కోస్గి: ప్రభుత్వం గొల్ల, కురుమ యాదవులకు రాయితీపై ఇస్తున్న గొర్రెలకు బదులు నగదు బదిలీ చేయాలని గొర్రెల పెంపకందారుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు హన్మంతు యాదవ్ అధ్యక్షతన మండల స్థాయి కాపరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రెండో విడత గొర్రెల కోసం డీడీలు కట్టిన కాపరులందరిని ఎంపిక చేయకుండా కొందరిని మాత్రమే ఎంపిక చేయడం సరికాదన్నారు. ప్రభుత్వం ఇస్తున్న గొర్రెలు సరిగ్గా లేకపోవడంతో కాపరులు నష్టపోతున్నారని, నగదు బదిలీ చేయడం వల్ల కాపరులే నాణ్యమైన జీవాలను తీసుకుంటారన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీఓ వెంకటయ్యకు అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా డైరెక్టర్ అల్లాపురం నర్సిములు, యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా గౌరవ అధ్యక్షుడు పీరంపల్లి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు నర్సిములు, మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు గంటల రమేష్, మోహన్, రవి, రమేష్, కొండప్ప, కాపరులు పాల్గొన్నారు.

గోవా మద్యం పట్టివేత



కృష్ణా: మండల సరిహద్దులోని చెక్‌పోస్టు వద్ద సోమవారం ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా వాహనాల తనిఖీ చేపట్టారు. ఓ ప్రైవేట్ బస్సులో గోవా నుంచి తీసుకొచ్చిన 20 మద్యం బాటిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. తనిఖీలో ఎన్‌ఫోర్స్‌మెంట్ మహబూబ్‌నగర్ ఎస్ఐ గణపతిరెడ్డి, ఎక్సైజ్ పోలీసులు మల్లన్‌గౌడ్, యాదగిరి, సయ్యద్‌బాషా, నరసింహా, రూక్యా తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ భవనాల నిర్మాణానికి స్థలాల గుర్తింపు



అమ్మపల్లిలో స్థలం ప్రొసిడింగ్ అందజేస్తున్న ఆర్ఐ శ్రీశైలం

మాగనూర్: పరిపాలన ప్రజలకు మరింత చేరువ కావాలనే లక్ష్యంతో చిన్న గ్రామా పంచాయతీలను ఏర్పాటు చేశారు. ఇటీవల నూతన గ్రామ పంచాయతీల సొంత భవనాల నిర్మాణాలకు రూ. 20 లక్షలు మంజూరయ్యాయి. సోమవారం మండలంలోని అమ్మపల్లి, అడవిసత్యారం గ్రామాలలో రెవెన్యూ అధికారులు స్థలం గుర్తించి ఆయా గ్రామాల సర్పంచ్‌లకు ప్రొసిడింగ్‌లు అందజేశారు. త్వరగతిన పనులు ప్రారంభించాలని ఎంపీఓ జైపాల్‌రెడ్డి ఆదేశించారు. కార్యక్రమంలో అమ్మపల్లి సర్పంచ్ పద్మమ్మ, అడవిసత్యారం సర్పంచ్ జానకమ్మ, ఆర్ఐ శ్రీశైలం, ఎంపీఓ జైపాల్‌రెడ్డి, నర్సిములు, శివరాంరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

కంసాన్‌పల్లి రైతులకు పట్టాపాసు పుస్తకాలు ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దామరగిద్ద: మండలంలోని కంసాన్‌పల్లిలో సర్వే నెంబర్ 229లో కాస్తులో ఉన్న రైతులకు వెంటనే పట్టాపాసు పుస్తకాలు అందించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్యగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట కంసాన్‌పల్లి రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ప్రమీలకు వినతి పత్రం అందజేశారు. రైతులకు పట్టాలు ఇవ్వక పోవడంతో రైతుబంధు, రైతుబీమా, బ్యాంకు రుణాలు, ఇతర సబ్సిడీలను పొందలేకపోతున్నారని వాపోయారు. స్థానిక ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి జోక్యం చేసుకొని రైతులకు న్యాయం చేయాలని కోరారు. లేని పక్షంలో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో శివకుమార్, రామకృష్ణ, మహేష్‌కుమార్, బొగ్గుల నర్సిములు, భాస్కర్, శ్రీనివాస్, మల్లేష్, కిష్టప్ప, పార్వతమ్మ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో మరింత భద్రత

నారాయణపేట రూరల్: ప్రతీ గ్రామం చైతన్యవంతమై సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే మరింత భద్రత లభిస్తుందని ఏఎస్ఐ ఆరీఫ్ అన్నారు. సోమవారం మండలంలోని జాజాపూర్‌లో పోలీసుశాఖ ఆధ్వర్యంలో కళాజాత బృందం అవగాహన సదస్సు నిర్వహించారు. మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అలాగే సైబర్ నేరాల వలలో పడే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహన డ్రైవింగ్ సమయంలో హెల్మెట్, సీటు బెల్టు ధరించాలన్నారు. సీఈఐఆర్ విధానంపై అవగాహన కల్పించారు. అనుమానితులు కనిపిస్తే వెంటనే డయల్ 100కు తెలియజేయాలని చెప్పారు. కార్యక్రమంలో కళాజాత బృందం సభ్యులు సురేందర్‌గౌడ్, శేఖర్, లింగన్న, కళ్యాణి, రుక్యానాయక్ పాల్గొన్నారు.

చెన్నకేశవరెడ్డికి డాక్టరేట్

మక్తల్: మండలంలోని ముస్టిపల్లి గ్రామానికి చెందిన ప్రాథమిక పాఠశాలల్లో హెచ్ఎంగా పని చేస్తున్న చెన్నకేశవరెడ్డికి ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. సమకాలిన్ హిందీ మహిళా ఉపన్యాస లేఖన్ మేస్తీ సంఘర్ష అనే అంశంపై పరిశోధనకు గాను డాక్టరేట్ దక్కింది. సోమవారం హైదరాబాద్‌లో వివేకవర్ధిని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి. విద్యాధర్ అందజేశారు. ఆయన ఐదు అంతర్జాతీయ, 12 జాతీయ సెమినార్లో పాల్గొని ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టరేట్ అందుకున్న చెన్నకేశవరెడ్డికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధ్యాయుడిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

మద్దూరు: మండలంలో లక్కయిపల్లి పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు కె. శ్రీనివాస్‌పై కొత్తపల్లి మండలంలోని నిడ్జింత గ్రామానికి చెందిన విజయ్‌కుమార్ సోమవారం కలెక్టర్‌కు, జిల్లా విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేశాడు. జిల్లా మత్స్యసహకార సంఘం డైరెక్టర్ ఎన్నికల్లో పోటీలో ఉంటే ఎమ్మెల్యే పేరు చెప్పి బెదిరించి భయభ్రాంతులకు గురిచేశాడని వివరించాడు. ఉపాధ్యాయుడిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఉద్యమం ఉధృతం చేస్తాం

నారాయణపేట రూరల్: వెనకబడిన కోటకొండపై రాష్ట్ర ప్రభుత్వం చూయిస్తున్న నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ రాబోయే రోజుల్లో మండల సాధన ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని మండల సాధన సమితి నాయకులు అన్నారు. కోటకొండలో నిర్వహిస్తున్న రిలే దీక్షలు సోమవారానికి 48వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సోమవారం తిర్మలాపూర్, కోటకొండకు చెందిన చెంచు సేవా సమితి నాయకులు దీక్షలో కూర్చున్నారు.

ఎమ్మెల్సీ వ్యాఖ్యలపై నిరసన



ధర్నా చేస్తున్న ముదిరాజ్ నాయకులు

కోస్గి: ముదిరాజ్ కులస్తులకు కించపరుస్తూ ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై నిరసనగా సోమవారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. స్థానిక శివాజీ చౌరస్తాలో పాలమూరు–తాండూర్ ప్రధాన రహదారిపై బైఠాయించి ఎమ్మెల్సీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కౌశిక్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఇందులో ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు తుడుం శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు అనంతయ్య పాల్గొన్నారు.

మద్దూరు: ముదిరాజ్‌లను కించపరుతూ వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డిని పదవి నుంచి బర్తరఫ్ చేయాలని ముదిరాజ్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ జయరాములుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ముదిరాజ్‌లు విజయ్, రాములు, నర్సిములు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

దామరగిద్ద: ముదిరాజ్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పాడి కౌశిక్‌రెడ్డిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని మండల ముదిరాజ్ సంఘం నాయకుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు ఈదప్ప, చాపలి వెంకటయ్య డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయనపై ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో వన్నడి చంద్రకాంత్, నీలి వెంకట్రాములు, మహిపాల్, ఎంపీటీసీ అంజప్ప, మాణిక్, నరేష్, వెంకటేష్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్ ప్రశాంతం



తిర్మలాపూర్‌లో పాఠశాల తరగతులను బహిష్కరిస్తున్న ఏబీవీపీ నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: పభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏబీవీపీ నిర్వహించిన విద్యాసంస్థల బంద్ ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలకు వెళ్లి తరగతులను బహిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కన్వీనర్ నరేష్ మాట్లాడుతూ.. రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జిల్లాలో బంద్‌ను విజయవంతం చేశామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతులు కల్పించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. పర్యవేక్షణ అధికారుల పోస్టులు లేక విద్యా సంస్థలు ఇష్టారీతిగా తయారయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఏటా పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న అనుమతులు లేని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇంతియాజ్, చరణ్, వెంకటరమణ, ఆకాష్, వరుణ్, సత్తి, వంశీ, వెంకటేష్, రాంరెడ్డి, శివ, అనిల్, కార్తీక్, ప్రసాద్ , భరత్, సాయిలు, రఘు, రాము, కాశీ, హన్మంతు, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ల పనితీరు మార్చుకోవాలి



అమ్మపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న సూపర్‌వైజర్ స్వర్ణలత

మాగనూర్: మండలంలో పని చేస్తున్న కొందరూ అంగన్‌వాడీ టీచర్లు పనితీరు మార్చుకోవాలని సూపర్‌వైజర్ స్వర్ణలత సూచించారు. సోమవారం ఆమె మండలంలోని అమ్మపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని కొన్ని అంగన్‌వాడీ సెంటర్లలో టీచర్లు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అయితే చిన్నారులకు అందించే పౌష్టికాహారం పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. రికార్డుల మెయింటేనెన్స్ సక్రమంగా ఉండాలని సూచించారు. కాంట్రాక్టర్ల నుంచి వచ్చే సరకుల విషయంలో జాగ్రత్తలు పాటిస్తూ తెప్పించుకోవాలని తెలిపారు. నాణ్యత లేకపోతే రిటర్న్ పంపించాలని అన్నారు.

ప్రధాన రహదారిపై బారికేడ్ల ఏర్పాటు



బారికేడ్లను ప్రారంభిస్తున్న సీఐ రవిబాబు

నారాయణపేట రూరల్: ఇటీవల సింగారం క్రాస్ రోడ్డు సమీపంలోని ప్రైవేటు పాఠశాల ఎదుట జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన ఘటన పాఠకులకు విధితమే. అదే ప్రాంతంలో గతంలోనూ పలు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. దీంతో పోలీసుల సూచనతో హైదరాబాద్, నారాయణపేట ప్రధాన రహదారిపై ఆ పాఠశాల యాజమాన్యం బారికేడ్లను సోమవారం ఏర్పాటు చేసింది. సీఐ రవిబాబు హాజరై వాటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వేగ నియంత్రణకు బారికేడ్లు ఉపయోగపడుతాయని, వాహనదారులు నిర్ణీత వేగాన్ని మించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతాయన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం ఇస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు జిల్లా వ్యాప్తంగా ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు తమ సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్లకు వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో బి.గోపాలం, సూర్యప్రకాష్, శ్రీమన్‌గౌడ్, భాస్కర్, సిద్ధలింగయ్య, మల్లికార్జున్, తిప్పారెడ్డి, చౌద్రి చందూలాల్, శంకర్, కనకప్ప ఆర్య, శంకరయ్య, నజీర్ అహ్మద్ పటేల్, సుభాష్, రాములు, శ్రీనివాస్, జయప్రకాశ్, రమేశ్ , పిడుగు నారాయణ, మల్లికార్జున్, సభ్యులు బసిరెడ్డి, గుండయ్య, వెంకట్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్

సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం ఆపాలని ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కాలనీవాసులు

నారాయణపేట రూరల్: సరాఫ్‌బజార్‌లోని దేవాలయ సమీపంలో నిర్మిస్తున్న సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలనే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ ఆ వార్డు ప్రజలు, భక్తులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త బుస్సయ్యస్వామి మాట్లాడుతూ.. ఆలయం పక్కనే మూత్రశాలలను నిర్మించడం వల్ల భక్తులకు దుర్వాసనతో ఇబ్బందులు కలుగుతాయని, సులభ్‌కాంప్లెక్స్‌కు సంబంధించిన నీరు 19వార్డు కాలువ నుంచి పారడంతో ఆ ప్రాంతంలోని ప్రజలు రోగాలబారిన పడే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే హైకోర్టు స్టే ఇవ్వడంతో పనులు నిలిచాయని, కలెక్టర్ తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని ఆ ప్రాంతంలో పోలీస్ ఔట్ పోస్టు ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సుజాత, గణేష్, సుమంగళ, నీలమ్మ, శంకర్, వీరేష్, లక్ష్మీకాంత్, రాజులాహోటీ, మారుతి, మణీశ్వర్, నారాయణశెట్టి, మంజునాథ్, విశ్వనాథ్, సోమనాథ్, ప్రభాకరవర్ధన్, మనీష్, రఘువీర్‌యాదవ్ పాల్గొన్నారు.

హైదరాబాద్ తరలిన ప్రజాపంథా నాయకులు



హైదరాబాద్‌కు తరలివెళ్తున్న సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీ నాయకులు

నారాయణపేట టౌన్: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం నిర్వహిస్తున్న డీవీ కృష్ణ ప్రథమ వర్ధంతి సభలకు జిల్లా కేంద్రం నుంచి సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీ నాయకులు ప్రత్యేక వాహనంలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆ పార్టీ డివిజన్ నాయకుడు కాశీనాథ్ మాట్లాడుతూ డీవీ కృష్ణ కార్మిక శాఖలో ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి కార్మికుల వెంట ఉండి పోరాటం చేశారని గుర్తుకు చేశారు. హైదరాబాద్ వెళ్లిన వారిలో సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా పట్టణ కార్యదర్శి కెంచి నారాయణ, మండల కార్యదర్శి నర్సింహులు, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయి కుమార్, మైనార్టీ కాలనీ సాధన కమిటీ అధ్యక్షుడు సాధిక్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు పలకలు పంపిణీ



బసిరెడ్డిపల్లిలో పలకలు పంపిణీ చేస్తున్న దృశ్యం...

నారాయణపేట రూరల్: తపస్ జిల్లా అధ్యక్షుడు శేర్ కృష్ణారెడ్డి తన కుమారుడు గురుచరణ్‌రెడ్డి 15వ జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం విద్యార్థులకు పలకలు పంపిణీ చేశారు. ప్రస్తుతం తను పనిచేస్తున్న బసిరెడ్డిపల్లితో పాటు గతంలో విధులు నిర్వహించిన కొత్తపల్లితండా చిన్నారులకు పలకలు అందించారు. 14ఏళ్లుగా కొనసాగిస్తున్న మొక్కల పంపిణీ కార్యక్రమం సైతం నిర్వహించారు. ఏటా తన కుమార్తె, కుమారుడు జన్మదినం సందర్భంగా డబ్బులను వృథా చేయకుండా మొక్కలు కొని నాటడం, ఉచితంగా పంచడం చేస్తున్నారు. అదేవిధంగా పాఠశాల విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేసి మొక్కల పెంపకం వల్ల కలిగే ఉపయోగాలు, చెట్లు అంతరించిపోతే జరిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం రవికుమార్, టీచర్లు రాంచంద్రారెడ్డి, ప్రకాష్ పాల్గొన్నారు.

సీఈఐఆర్ టెక్నాలజీతో సెల్‌ఫోన్ల పట్టివేత



బాధితులకు సెల్‌ఫోన్ అందిస్తున్న పోలీసులు

నారాయణపేట రూరల్: ఇటీవల నూతనంగా అందుబాటులోకి వచ్చిన సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటి రిజిస్టర్ (సీఈఐఆర్) టెక్నాలజీని ఉపయోగించి సోమవారం జిల్లాలో చోరీకి గురయిన మూడు మొబైల్ ఫోన్లను పోలీసులు పట్టుకున్నారు. సీఐ రవిబాబు తెలిపిన వివరాల ప్రకారం .. లక్ష్మీపూర్‌కు చెందిన ప్రవీణ్‌కుమార్ రూ.32వేలు, శ్యాసన్‌పల్లికి చెందిన అయ్యప్ప రూ.16వేలు, బండగొండ గ్రామానికి చెందిన శ్రీను రూ.24వేలకు విలువైన ఫోన్లను ఈ నెలలో పోగొట్టుకున్నారు. 12 రోజులుగా క్రైమ్‌బ్రాంచ్ పోలీసులు ఐటీ కోర్ టీమ్ సహాయంతో కొత్త టెక్నాలజీ ఆధారంగా ఫోన్లను గుర్తించి బాధితులకు సోమవారం అందించారు. ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే పోలీసులకు ఫిర్యాదు చేయాలని, ఈ టెక్నాలజీతో వీలైనంత తొందరగా గుర్తించి అందిస్తామని చెప్పారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



నారాయణపేట రూరల్: విద్యారంగ సమస్యల పరిష్కారంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మోహన్, నరహరి విమర్శించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేసి కార్యాలయంలో డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యారంగ హక్కులను కాపాడుకునేందుకు నిరంతరం పోరాటం చేస్తామన్నారు.